సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 11 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



రహదారులకు ప్రాధాన్యం
రహదారుల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి తెలిపారు. 8లో

గరిష్టం/కనిష్టం
40.6°/24.2°
జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు



అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీ ప్రారంభమైన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు శనివారం ముగిశాయి. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా జరిగిన చివరి రోజు పరీక్షకు 522 మంది అభ్యర్థులకుగానూ 384 మంది (74.56 శాతం) హాజరయ్యారు. 138 మంది గైర్హాజరయ్యారు.

పాడి రైతులకు శుభవార్త



కదిరి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం, 'ది కైరా' జిల్లా కోఆపరేటివ్ పాల ఉత్పత్తిదారుల సమితి(అమూల్ డెయిరీ) పాడి రైతులకు శుభవార్త చెప్పింది. 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమంలో భాగంగా వరుసగా ఐదోసారి పాల కొనుగోలు ధరలు పెంచింది. ప్రస్తుతం ఆవుపాలు లీటర్ ధర రూ.34.59 ఉండగా దాన్ని రూ.1.22 పెంచి రూ. 35.82 చేసింది. అలాగే లీటర్ గేదెపాలను ప్రస్తుతం రూ.45.96 సేకరిస్తుండగా, దాన్ని రూ. 1.91 పెంచి రూ. 47.88 చేసింది. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి వస్తాయని 'అమూల్' డెయిరీ జిల్లా ఇన్‌చార్జ్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. పెరిగిన పాల సేకరణ ధరలతో అన్నమయ్య, వైఎస్సార్, చిత్తూరు, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లోని 11 వేల మంది పాడిరైతులకు ప్రయోజనం కలగనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రోజుకు 90 వేల లీటర్ల పాలసేకరణ జరుగుతోందన్నారు.

12 నుంచి విద్యార్థులకు బస్‌పాసులు



పుట్టపర్తి టౌన్: నూతన విద్యాసంవత్సరం ఆరంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు బస్సు పాసులు ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పుట్టపర్తి డిపో మేనేజర్ ఇనయతుల్లా శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు బస్సులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత బస్ పాసులు అందజేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తును భర్తీ చేసి, స్టడీ సర్టిఫికెట్, ఫొటోతో పాటు నిర్ణీత రుసుం చెల్లించి బస్ పాసు పొందాలని సూచించారు. అలాగే ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు సీజన్ పాస్‌లు జారీ చేస్తామన్నారు. దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్, ఆధార్, ఫొటోతో పాటు నిర్ణీత రుసుము చెల్లించి మూడేళ్ల కాల వ్యవధితో చెల్లుబాటయ్యే బస్సు పాస్‌ను పొందవచ్చునన్నారు. వివరాలకు 99592 25857లో సంప్రదించాలని కోరారు.

నేడు 'మోడల్' పరీక్ష

ప్రశాంతి నిలయం : ఏపీ మోడల్ స్కూళ్లలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు ఏ మోడల్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకున్నారో అదే స్కూల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందని ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి తెలిపారు. జిల్లా నుంచి 1,068 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.

విద్యార్థికి తొలిరోజే కానుక

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్ సర్కార్... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా అన్నీ సమకూరుస్తోంది. 'జగనన్న విద్యాకానుక' కిట్ పేరుతో పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులతో పాటు యూనిఫాం, షూ, బెల్టు, స్కూల్ బ్యాగ్ తదితర వాటిని అందిస్తోంది. ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యాసామగ్రి పంపిణీ చేసేందుకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.



- పాఠశాలలకు చేరిన 'జగనన్న విద్యాకానుక' కిట్లు
- రేపు విద్యార్థులందరికీ పంపిణీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- 1.56 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- వస్తువుల నాణ్యతకు పెద్దపీట వేసిన ప్రభుత్వం



ధర్మవరం స్టాక్ పాయింట్‌లో జగనన్న విద్యాకానుక కిట్లను సిద్ధం చేస్తున్న సీఆర్పీలు



ప్రశాంతి నిలయం: 'భావి తరాలకు మనమిచ్చే ఆస్తి చదువే'నని తరచూ చెప్పే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచీ విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. 'నాడు- నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల కల్పనకు రూ.కోట్లు వెచ్చించి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. చిన్నారులను పాఠశాలకు పంపే తల్లిదండ్రులకు ఎలాంటి ఖర్చు లేకుండా చూస్తున్నారు. ఈ క్రమంలోనే పాఠశాలల పునఃప్రారంభం రోజే 'విద్యా కానుక' కింద యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్, షూ తదితర వాటిని అందిస్తున్నారు. సోమవారం పాఠశాలలు తెరుచుకోనుండగా, అదే రోజు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. గత ఏడాది ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న చిన్నారుల సంఖ్య ఆధారంగా 'విద్యాకానుక' కిట్లు స్కూళ్లకు చేర్చారు. అలాగే నూతన అడ్మిషన్ల కోసం 5 శాతం అదనంగా కిట్లు అందుబాటులో ఉంచారు.



పరిగిలో స్టాక్ పాయింట్‌కు చేరిన విద్యాకానుక కిట్ల గురించి ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

విద్యాకానుక కిట్ల పంపిణీ ఇలా....

జిల్లాలో 1,553 ప్రాథమిక, 306 ప్రాథమికోన్నత, 306 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రాథమి పాఠశాలల్లో 51,330 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20,155, ఉన్నత పాఠశాలల్లో 89,888 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ 'జగన్న విద్యాకానుక' కిట్లను పంపిణీ చేసేందుకు జూన్ 1 నుంచే జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. తొలుత జిల్లా స్టాక్‌పాయింట్ నుంచి మండల కాంప్లెక్స్‌లకు, అక్కడ వస్తువుల నాణ్యతను పరీక్షించిన తర్వాత నేరుగా పాఠశాలలకు తరలించారు. పది రోజులుగా కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారుల వరకూ అందరూ 'విద్యా కానుక' కిట్ల పంపిణీ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

9 రకాల సామగ్రి

ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయనున్న విద్యా కానుక కిట్‌లో 9 రకాల విద్యా సామగ్రి ఉండనుంది. అందులో మూడు జతల యూనిఫాంకు సరిపడా దుస్తులు, బెల్టు, షూ, పుస్తకాల బ్యాగ్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీ, వర్కు బుక్కులు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఉంటాయి.

మూడు జతల యూనిఫాం

గతంలో ఒక్కో విద్యార్థికి రెండు జత యూనిఫాం మాత్రమే ఇచ్చేవారు. ఈ ఏడాది నుంచి ఒక్కో విద్యార్థికి మూడు జతలకు సరిపడా వస్త్రాన్ని అందిస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులు కాస్త లూజుగా దుస్తులు కుట్టించుకున్నా ఇబ్బంది ఉండకుండా 10 శాతం అదనంగా వస్త్రాన్ని అందించనున్నారు. అలాగే యూనిఫాం కుట్టించుకునేందుకు విద్యార్థి తల్లి ఖాతాకు నగదు జమ చేయనున్నారు.

కొలత ఆధారంగా షూలు

విద్యాకానుక కిట్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 8, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 14 చొప్పున నోటు పుస్తకాలను అందివ్వనున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసే షూ కూడా సరిగ్గా సరిపోయేలా ముందుగానే విద్యార్థి పాదాల కొలతలు సేకరించారు.

క్వాలిటీ వాల్ ఏర్పాటు..
నాణ్యతపై ప్రత్యేక కసరత్తు

కిట్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా సామగ్రి అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కసరత్తు చేసింది. ఈ ఏడాది జిల్లాలోని 32 మండలాలకు ఒక్కో క్వాలిటీ వాల్‌ను సరఫరా చేసింది. ప్రతి మండల కాంప్లెక్స్‌లోనూ క్వాలిటీ వాల్‌ను ఏర్పాటు చేసి ఇందులో జగనన్న విద్యాకానుక కిట్లలో అందించే విద్యా సామగ్రిని ప్రదర్శించేలా ఏర్పాట్లు చేసింది. దీంతో తల్లిదండ్రులకు అవగాహన కలుగుతుంది. అలాగే మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లలో 'విద్యాకానుక కిట్ల' పర్యవేక్షణకు మండల విద్యాధికారితో పాటు, ముగ్గురు ప్రధానోపాధ్యాయులతో ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు విద్యా సామగ్రి నాణ్యత పరిశీలించడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా విద్యాకానుక కిట్లు పాఠశాలలకు చేరాయా... లేదా అన్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాయి. ఎక్కడైనా కిట్ల కొరత ఉంటే వెంటనే సరఫరా అయ్యేలా చూస్తున్నాయి.

తొలి రోజే కానుక అందిస్తాం



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం 'జగనన్న విద్యాకానుక' కిట్లను అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వస్తువుల నాణ్యత పూర్తిగా పరిశీలించిన తర్వాతే పాఠశాలలకు చేర్చాం. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగానే పాఠశాలల్లో కిట్లు అందుబాటులో ఉంచాం. ప్రతి మండల కాంప్లెక్స్‌లోనూ క్వాలిటీ బోర్డును ఏర్పాటు చేసి విద్యాకానుక కిట్‌లో పంపిణీ చేస్తున్న సామగ్రిని ప్రదర్శిస్తాం.
–రంగస్వామి, ఇన్‌చార్జ్ డీఈఓ

అలాంటి వారికి మిగులు ఖాళీలే

- 'తప్పనిసరి' అయినా దరఖాస్తు చేసుకోని టీచర్లకు మిగులు ఖాళీల్లో పోస్టింగ్‌లు



రాప్తాడురూరల్: తప్పనిసరి బదిలీగా ఉండి దరఖాస్తు చేసుకోని టీచర్లకు మిగులు ఖాళీల్లో మాత్రమే ఇవ్వాలంటూ విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. శనివారం స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎంల బదిలీల ఉత్తర్వులు జారీ చేశారు. స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజెస్) 1,298 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 640 మందికి బదిలీ కాగా.. 658 మందికి రిటైన్ (పాతస్థానాలు) ఇచ్చారు. ఇంగ్లిష్ 304, హిందీ 143, కన్నడ 3, సంస్కృతం 3, తెలుగు 156, ఉర్దూ ఒక టీచరు బదిలీ అయ్యారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజెస్) 2,192 మంది దరఖాస్తు చేసుకోగా 780 మంది బదిలీ అయ్యారు. మరో 122 మంది ఎస్జీటీలు, పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చారు. తక్కిన 1,290 మంది రిటైన్ అయ్యారు. బయలాజికల్ సైన్స్‌లో 145 మంది, గణితం 243 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) 37 మంది, ఫిజికల్ సైన్స్ 165 మంది, సోషల్‌లో 190 మంది టీచర్లు బదిలీ అయ్యారు. పదోన్నతులు పొందిన వారిలో బయలాజికల్ సైన్స్ 2, గణితం 77, పీడీలో 5, పీఎస్‌లో 4, సోషల్‌లో 34 మంది ఉన్నారు. ఇక పీఎస్‌హెచ్‌ఎంలకు సంబంధించి మొత్తం 249 మంది దరఖాస్తు చేసుకోగా 194 మందిని బదిలీ చేశారు. 55 మందిని రిటైన్ చేశారు. ఎస్జీటీల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులను ఆదివారం జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

వారిని వెంటనే రిలీవ్ చేయాలి

ప్రమోషన్లు పొందిన, సబ్జెక్టు కన్వర్షన్ ఇచ్చిన, 8 ఏళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ అయిన టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని డీఈఓ సాయిరామ్ హెచ్‌ఎంలు, ఎంఈఓలను ఆదేశించారు. తక్కిన సబ్జెక్టు టీచర్లు, ఎస్జీటీలకు సంబంధించి వారిస్థానంలో ఎవరైనా వచ్చిన తర్వాతనే రిలీవ్ చేయాలన్నారు. 2008 మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) టీచర్లు పాతస్థానాల్లోనే చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ల స్థానాల్లో పండిట్లను సర్దుబాటు చేసుకోవాలన్నారు.

పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే శంకరనారాయణ
- రూ.14 కోట్లతో నిర్మించిన కొండ రోడ్డు ప్రారంభం



కొండరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: పర్యాటకంగా పెనుకొండను మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, కొండపైకి రోడ్డు నిర్మాణం అందులో భాగమేనని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. రూ.14 కోట్లతో నిర్మించిన కొండ రోడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ నయీముల్లా, డీఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ, కొండపైకి రోడ్డు నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారన్నారు. వారి కోరిక మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టుదలతో కొండపైకి రోడ్డు వేయించిందన్నారు. గత ప్రభుత్వాలు తూతూ మంత్రంగా నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నాయన్నారు. అయితే తాను ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి కొండపైకి వెళ్లేందుకు రోడ్డు వేయించానన్నారు. దీనివల్ల పెనుకొండ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెనుకొండ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కొండ రోడ్డుకు తగినన్ని నిధులు మంజూరు చేశారన్నారు. అంతేకాకుండా కొండపై రూ.400 కోట్లతో ఇస్కాన్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నిర్మిస్తుండగా, అక్కడ ఇతర వసతులకు కోసం 90 ఎకరాలకుపైగా స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు. కొందరు నేతలు తామేదో చేశామని సెల్ఫీలు దిగుతూ గొప్పలు చెప్పుకుంటున్నారని, వాస్తవం ఏమిటన్నది ప్రజలందరికీ తెలుసన్నారు. త్వరలోనే కొండపైకి తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆయన ఇంజినీరింగ్ ఛీఫ్‌ను కోరారు. కార్యక్రమంలో పెనుకొండ నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు తయూబ్, సద్దాం, శేషాద్రి, రఘునాథరెడ్డి, నేమతుల్లా, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నాగలూరుబాబు, బోయనరసింహ, నాయకులు బోయబాబు, పొగాకు రామచంద్ర, గణేష్, పాదయాత్ర నటేష్, శ్రీరాములు, ఫరీద్ పాల్గొన్నారు.


ఫిట్‌లెస్ బస్సులు

- బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించని 'ప్రైవేటు' యాజమాన్యాలు

సాక్షి, పుట్టపర్తి: పిల్లలకు మెరుగైన బోధన ఎంత ముఖ్యమో భద్రత కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా చిన్నారులను పాఠశాలలకు చేరవేసే బస్సులకూ ఫిట్‌నెస్ చాలా ముఖ్యం. అందుకే ఆర్టీఏ అధికారులు ఏటా బడుల పునఃప్రారంభానికి ముందే స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు ఇస్తారు. ఈ ఏడాది కూడా జిల్లా వ్యాప్తంగా స్కూల్ బస్‌లకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. కానీ కొన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

పెండింగులో 84 బస్సులు : జిల్లాలో 358 స్కూల్ బస్సులున్నాయి. అందులో ఇప్పటి వరకు 274 బస్సులు ఫిట్‌నెట్ పరీక్షలు పూర్తి చేసుకున్నాయి. మిగతా 74 బస్సులు రావాల్సి ఉందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. రేపు స్కూళ్లు పునఃప్రారంభం కానున్నా...ఆయా ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకపోవడం చాలా అనుమానాలకు తావిస్తోంది. అవి కాలం చెల్లినవైనా ఉండాలి, లేదా సామర్థ్యం లేనివైనా ఉండాలని అధికారులు భావిస్తున్నారు.

అలాంటి వాహనాలు సీజ్ చేస్తాం



పాఠశాలలు వినియోగించే అన్ని బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి. ఎలాంటి పరీక్షలు లేకుండా పిల్లలతో రోడ్డెక్కిన బస్సులపై ఈనెల 12వ తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. తనిఖీల్లో పట్టుబడిన బస్సులను సీజ్ చేస్తాం. ఇందులో 15 ఏళ్ల పైబడిన వాహనాలు ఏవీ కూడా తిరగడానికి వీలు లేదు. పాఠశాల బస్సుల నిబంధనల్లో రాజీ పడే ప్రసక్తే లేదు. – కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి



హరివిల్లు.. కనువిందు

శనివారం ఉదయం నుంచీ భగభగ మండుతున్న సూర్యుడిని మేఘాలు కమ్ముకోగా, సాయంత్రం వరుణుడు పలకరించాడు. ఆ తర్వాత వరుణుడూ కాసేపు విశ్రాంతి తీసుకోగా గగనంపై హరివిల్లు సాక్షాత్కరించింది. మిలమిల మెరుస్తూ కనువిందు చేసిన ఇంద్ర ధనస్సును చిన్నా, పెద్దా ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రకృతి వర్ణ చిత్రాన్ని కొందరు సెల్‌ఫోన్లలో బంధించి అపురూపంగా దాచుకున్నారు.
– అమరాపురం:

క్లుప్తంగా

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్లు అందుకున్న ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలు

హిందూపురం టౌన్: ప్రభుత్వ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణాధికారి డాక్టర్ కేసీ కుళ్లాయప్ప నాయక్ ఆదేశించారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓల నైపుణ్యాల పెంపుపై 3వ బ్యాచ్‌కు వారం రోజుల పాటు చేపట్టిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్, హెచ్‌డబ్ల్యూసీ పర్యవేక్షణ అధికారి డాక్టర్ నాగరాజుతో కలసి సర్టిఫికెట్లను కుళ్లాయప్ప నాయక్ అందజేసి, మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. డీపీఎంఓలు, నోడల్ అధికారులు రెడ్డికుమార్‌రెడ్డి, రమణ, సీహెచ్‌ఓ నోడల్ అధికారి వన్నప్ప, శిక్షకులు సవిత, అమర ప్రియ, రాధిక పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం సమీపంలో ఉన్న రామాంజనేయులు వ్యవసాయ తోటలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు బత్తలపల్లి ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష తెలిపారు. వివరాలు.. సంజీవపురం సమీపంలోని వ్యవసాయ తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం పక్కా సమాచారంతో పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. తోటలో పేకాట ఆడుతూ ఇటుకలపల్లి, సంజీవపురం, ముష్టూరు, బత్తలపల్లి గ్రామాలకు చెందిన తొమ్మిది మంది పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకుని, ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

జాతీయ రహదారులకు ప్రాధాన్యం

- సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి
- రూ.652.8 కోట్ల పనులకు భూమిపూజ


చిత్రావతి రివర్ క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు


మాట్లాడుతున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

బత్తలపల్లి: నాగరికతకు చిహ్నాలుగా భావించి రోడ్ల నిర్మాణాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం నుంచి రూ.కోట్ల నిధులు తీసుకువచ్చి మెరుగైన రవాణా సౌకర్యం కోసం కృషి చేస్తున్నారన్నారు. శనివారం మండల పరిధిలోని రామాపురం–దంపెట్ల సమీపాన చిత్రావతి నది వద్ద రూ.652.8 కోట్లతో చేపట్టిన నాలుగు వరుసల రహదారి నిర్మాణం, చిత్రావతి రివర్ క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణ పనులకు హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్‌తో కలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకు 33 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి నిర్మాణంతో పాటు చిత్రావతి రివర్ క్రాసింగ్ బ్రిడ్జి పనులను ఏడాదిలోపు పూర్తయ్యేలా చూడాలని జాతీయ రహదారుల శాఖ అధికారులకు సూచించారు. బత్తలపల్లి మీదుగా బైపాస్ రహదారి నిర్మాణం, ముదిగుబ్బ మీదుగా బైపాస్ రహదారి, బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకు నాలుగు వరుసల రహదారి, చిత్రావతి రివర్ క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణపు పనులు దక్కించుకున్న హెచ్‌డీ ఇన్‌ఫ్రా పనులు ముమ్మరం చేయాలన్నారు. ముదిగుబ్బ నుంచి కదిరి వరకు నాలుగు వరుసల రహదారి పనులు పూర్తయితే తిరుపతి వెళ్లేందుకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. పుట్టపర్తి నుంచి ముదిగుబ్బ మండలం సానేవారిపల్లి మీదుగా వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు భూ సేకరణ పూర్తి కావచ్చిందని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీ మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం రూ.23 వేల కోట్లు విడుదల చేసిందని, ఇందుకు కేంద్ర రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు హెచ్‌డీ ఇన్‌ఫ్రా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సర్పంచు చల్లా కరుణాకర్ నాయుడు, హెచ్‌డి ఇన్‌ఫ్రా ఎండీ మంజునాథ దేవేంద్రన్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యత

- ఎమ్మెల్సీ ఏసురత్నం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏసురత్నం

కొత్తచెరువు: రాష్ట్ర చరిత్రలో వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినేనని ఎమ్మెల్సీ ఏసురత్నం అన్నారు. కొత్తచెరువులోని పెద్దమ్మ దేవాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టసభల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలను సీఎం వైఎస్ జగన్ వడ్డెర్లకు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో వడ్డెర్లంతా ఐక్యతగా నిలిచి మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వడ్డె నారాయణ, ఏపీ వడ్డెర్ల కోర్ కమిటీ చైర్మన్ శ్రీరాములు, జాతీయ వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు ముదిరాజ్‌కుమార్, నాయకులు తిరుపతేంద్ర, పూజారి పెద్దన్న, రామచంద్ర, శ్రీనివాసులు, పోలప్ప, నారాయణ స్వామి, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు సుఖాంతం

హిందూపురం: స్థానిక ఆబాద్‌పేటకు చెందిన ఇద్దరు బాలికల అదృశ్యం కేసు సుఖాంతమైంది. తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికలను వన్‌టౌన్ పోలీసులు కనిపెట్టి సురక్షితంగా శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 7వ తేదీన తన కుమార్తెలను తండ్రి మందలించడంతో 14, 13 ఏళ్ల వయసున్న బాలికలు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ కంజాక్షన్ ఆదేశాలతో సీఐ ఈరన్న, ఎస్‌ఐ హరుణ్ బాషా నేతృత్వంలో రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు స్థానిక ఇందిరమ్మ కాలనీలో తలదాచుకున్న బాలికలను గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

నీటి గుంతలో పడి వివాహిత మృతి

సోమందేపల్లి: మండలంలోని ఈదులబళాపురం చెరువులో పడి ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ఈదులబళాపురం గ్రామానికి చెందిన వెంకప్ప కుమార్తె లక్ష్మీనరసమ్మ (27)కు 12 ఏళ్ల క్రితం కల్లుమర్రి గ్రామానికి చెందిన శేఖర్‌తో వివాహమైంది. శనివారం గొర్రెలను మేపునకు తోలుకెళ్లిన లక్ష్మీనరసమ్మ ప్రమాదవశాత్తు నీటి గుంతలో జారి పడి మృతి చెందింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్య పరిస్థితులతో ఒకరు.. మనస్తాపం చెంది ఇంకొకరు... కుటుంబ కలహాలతో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.


రాజశేఖర్ (ఫైల్), ఆంజనేయులు (ఫైల్), మృతుడు తరుణ్

నల్లచెరువు: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని జోగన్నపేట గ్రామానికి చెందిన రాజశేఖర్(35) గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజశేఖర్‌ను కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన... శనివారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి.. ఆ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజశేఖర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో విసుగు చెంది..

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరోళ్లపల్లిలో శుక్రవారం సాయంత్రం ఆంజనేయులు(24) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబకలహాలతో మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి ఏడాదిన్నర క్రితమే వివాహమైంది.

అమ్మ తిట్టిందని..

కదిరి టౌన్: స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉన్న నివాసముంటున్న ప్రేమలత కుమారుడు తరుణ్‌కుమార్(14) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసిన తరుణ్‌కుమార్... పదో తరగతి ప్రత్యేక తరగతులకు వెళుతున్నాడు. అయితే తరగతులకు సక్రమంగా హాజరు కావడం లేదని శనివారం ఉదయం పాఠశాల యాజమాన్యం నుంచి సమాచారం అందుకున్న తల్లి తన కుమారుడిని మందలించింది. సక్రమంగా చదువుకుని ప్రయోజకుడివి కావాలని సూచించి బజారుకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న తరుణ్‌కుమార్ తలుపులు వేసి ఫ్యాన్‌కు తల్లి చీరతో ఉరి వేసుకున్నాడు. అదే సమయంలో ఇంటి పక్కనే ఉన్న బంధువులు తలుపులు తట్టిన తెరవకపోవడంతో బద్దలుగొట్టి లోపలకు వెళ్లారు. ఉరికి వేలాడుతున్న తరుణ్‌ను దించి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బాలుడు మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి రోదన మిన్నంటింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర హాకీ జట్టు కెప్టెన్‌గా ధర్మవరం వాసి


వెంకటేష్ నాయక్

ధర్మవరం రూరల్: ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు ఒడిశాలోని రూర్కెలాలో జరిగే 13వ జాతీయ జూనియర్ పురుషుల హాకీ చాంపియన్ షిప్ టోర్నీలో పాల్గొనే ఏపీ జట్టుకు కెప్టెన్‌గా ధర్మవరం మండలం నేలకోట గ్రామానికి చెందిన వెంకటేష్ నాయక్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ హాకీ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు, శ్రీసత్యసాయి జిల్లా సెక్రటరీ బందనాథం సూర్యప్రకాష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ నాయక్‌ను హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, ప్రతినిధులు ఉడుముల రామచంద్ర, గౌరీ ప్రసాద్, అంజన్న, కోచ్ హుసేన్ తదితరులు అభినందించారు.

1,786 మట్టి నమూనాల విశ్లేషణ

- భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజాపుష్పలత



అనంతపురం అగ్రికల్చర్: రైతులకు ఎరువుల ఖర్చు తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంలో భాగంగా జిల్లాలో మట్టి పరీక్షల విశ్లేషణ చేపట్టినట్లు భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజాపుష్పలత తెలిపారు. శనివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రతి ఆర్‌బీకే పరిధిలో రెండు చొప్పున తొలి విడతగా అనంతపురం జిల్లాలో 918, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 434... మొత్తంగా 1,786 మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు వివరించారు. ఒక్కో నమూనా నుంచి 12 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా పీహెచ్ (భూమి స్థితి) శాతం, ఎలెక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పోటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించి క్రోడీకరించనున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల భూమిలో ఉన్న పోషకాల లభ్యత, లేనివి, వాటి శాతం ఎంతనేది తెలుస్తుందన్నారు. వాటి ఆధారంగా రైతులు సాగు చేసే పంటలను బట్టి ఎరువులను సిఫారసు చేయనున్నామన్నారు. ప్రతి రైతు తన పొలానికి సంబంధించి కనీసం మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రధానంగా భూమిలో సేంద్రియ కర్బనం పెరగడం వల్ల పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చినందున మట్టి పరీక్షల విశ్లేషణ ఖచ్చితంగా చేపడుతున్నట్లు తెలిపారు.

చెట్టు మీద పడి చిన్నారి మృతి

పూతలపట్టు: మండలంలో శనివారం పెనుగాలులకు తాటి చెట్టు కూలి మీద పడడంతో ఓ చిన్నారి మృతిచెందింది. పోలీసుల తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన టి.ప్రకాష్ కుటుంబంతో కలిసి ఏడాది క్రితం పూతలపట్టు మండలం గువ్వలకాలనీకి వచ్చాడు. అక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ భార్య, కుమార్తెను పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం పెను గాలులు వీయడంతో ప్రకాష్ కూతురు సిరి(6), భార్యతో కలసి పక్కనున్న తాటి చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో తాటిచెట్టు కూలి మీదపడడంతో తీవ్రంగా గాయపడిన బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బత్తలపల్లి: అధిక ధరకు రేషన్ బియ్యాన్ని విక్రయించే ఓ వ్యక్తి పట్టుబడినట్లు ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష తెలిపారు. వివరాలు.. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నాగరాజు శనివారం ఉదయం బత్తలపల్లి ఎస్సీ కాలనీలో ప్రజల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్నట్లుగా అందిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నాగరాజును అదుపులోకి తీసుకుని అతని నుంచి 750 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని ముదిగుబ్బలోని హోటల్ నిర్వాహకులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లుగా విచారణలో నాగరాజు అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని బత్తలపల్లి సీఎస్‌డీటీ శారదకు అప్పగించి, నాగరాజుపై కేసు నమోదు చేశారు.

స్వీయ పరివర్తన సాధనే 'బాల వికాస్' లక్ష్యం


జ్ఞాపికను అందజేస్తున్న హిమవాహిని రత్నాకర్


నాటికలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: బాల్యం నుంచే స్వీయ పరివర్తన సాధించే దిశగా క్రమ శిక్షణతో కూడిన విద్యాబోధనను అందించడమే సత్యసాయి బాలవికాస్ విద్యా లక్ష్యమని బాలవికాస్ పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. బాలవికాస్ పూర్వ విద్యార్థుల స్నాతకోత్సవం రెండు రోజుల కార్యక్రమాలు శనివారం ప్రశాంతి నిలయంలో జరిగాయి. తొలుత పూర్వ విద్యార్థులు వేదపఠనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరి నిర్వహించారు. సత్యసాయి బోధనలు తమ జీవితాల్లో తీసుకువచ్చిన మార్పులను ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు వివరించారు. సత్యసాయి మిషన్‌ను ముందుకు తీసుకుపోవడంలో విశేష కృషి చేసిన పలువురు బాలవికాస్ పూర్వ విద్యార్థులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు సతీమణి హిమవాహిని జ్ఞాపికలు అందజేశారు. సాయంత్రం మానవతా విలువలు, యువత బాధ్యతలు, ఆధ్యాత్మిక చింతన వంటి అంశాలపై బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


సంగీత కచేరి నిర్వహిస్తున్న బాలవికాస్ పూర్వ విద్యార్థులు